# నేరము శిక్ష

**అప్పుడప్పుడే తెలవారుతోంది. ఆకాశంలో వేకువ వెలుగులు పరుచుకుంటున్నాయి. ముంబాయి నగరం బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటోంది. గంగూబాయి వడివడిగా అడుగులేస్తూ తను రోజూ పనిచేసే డాక్టర్ విశ్వాస్ ఇంటికి చేరుకుంది.**

**ఆ ఇంట్లోకి వీలయినంత త్వరగా పనిముగించుకొని మరో నాలుగిళ్లలో పనికెళ్లాలని గంగూబాయి తాపత్రయం. తలుపు తట్టగానే నెమ్మదిగా తలుపు తెరుచుకుంది.**

## మలుపు

**- ఆదిత్య**

తరచూ డాక్టర్‌కు నిద్ర డిస్టర్బ్ అవకుండా తెల్లవారుజామునే డాక్టర్‌గారి భార్య నందిని తలుపు గడియ తీసి వుంచుతుంది. గంగూబాయి గబగబా కిచెన్‌లోకి వెళ్లి సింక్‌లోని గిన్నెలు తీసి కడగసాగింది.

ఓసారి బెడ్‌రూమ్ వైపు చూసింది గంగూబాయి. అమ్మగారు పడుకునే వున్నారు. గామోసు అనుకుంటూ తన పనిలో నిమగ్నమై ఏదో గుర్తుకొచ్చినట్టు పక్కకు తిరిగి చూసింది. ఫ్రిజ్ తలుపు సరిగ్గా వేసి లేదు. సగం తెరుచుకొని వుంది.

''అమ్మగారికి రోజురోజుకీ మతిమరుపు ఎక్కువ అవుతోంది. ఫ్రిజ్ తలుపు వేయకుండా పడుకుంది...'' అనుకుంటూ ఫ్రిజ్ తలుపు సరిచేసి ఇల్లు చిమ్మసాగింది. మళ్లీ ఫ్రిజ్ వైపు చూస్తే తలుపు తెరుచుకునే వుంది. ఫ్రిజ్‌లో వస్తువులు సరిగ్గా పెట్టనందుకే అలా తలుపులు తెరుచుకుంటున్నాయని అనుకొని చీపురు పడేసి ఫ్రిజ్ తలుపు పూర్తిగా తెరిచింది. అందులో సామాన్లు సర్ది పెడదామని కొద్దిగా వంగింది అంతే... ఫ్రిజ్‌లోని దృశ్యం చూస్తూనే...

గంగూబాయి భయంతో వణికిపోయింది. ఆమె గొంతులోని కేక గొంతులోనే వుండిపోయింది. ఇంతలో క్లిక్‌మని బెడ్‌రూమ్ తలుపు తెరుస్తున్న శబ్దం వినిపించడంతో ఒక్క అంగలో ఆ ఇంట్లో నుంచి బయటపడి పరుగు లంకించుకుంది గంగూబాయి.

★ ★ ★

''నాపేరు నైనా మీకు నాలుగిళ్లకు అవతల వుంటున్నాను...'' అంటూ నవ్వుతూ పలకరిస్తున్న నైనాను

''రండి...'' అంటూ ఇంట్లోకి ఆహ్వానించింది నందిని. నైనా ఇంట్లో అడుగుపెడుతూ హాల్లో వున్న సోఫాలో కూర్చుంది. నందినికి నైనాను చూస్తే ముచ్చటేసింది. ఎందుకంటే నైనా వట్టి మనిషి కాదు గర్భిణీ.

''కూర్చోండి...'' అంటూ కిచెన్‌లోకి వెళ్లి కాఫీ కప్పు తెచ్చి నైనాకు అందించింది.

కాఫీ సిప్ చేస్తూ ''డాక్టర్‌గారు లేరా'' అని అడిగింది నైనా.

''ఓహ్.. డాక్టర్ గారి కోసం వచ్చారా.. అవును ఈ సమయంలో మీకు డాక్టర్ పర్యవేక్షణ ఎంతో అవసరం. ఆయన ఇంకా రాలేదు. కాసేపట్లో వస్తారు కూర్చోండి...''అంటూ ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

వాళ్లలా కబుర్లలో వుండగానే పోర్టికోలో కారు ఆగిన చప్పుడు అయింది. నందిని ఎదురెళ్లి డాక్టర్ చేతిలో బ్రీఫ్‌కేస్ అందుకొంది.

డాక్టర్ విశ్వాస్ గబగబా తన గదిలోకి వెళుతూ కూర్చొన్న అమ్మాయిని చూసి ''ఎవరూ...'' నందినిని అడిగాడు టై విప్పుతూ...

''మన వీధిలోనే వుంటుందట. పాపం మీ కోసం వచ్చింది...''

''ఇక్కడికెందుకు రావడం? క్లినిక్‌కు రమ్మను...'' అన్నాడు విసుగ్గా.

''ఇంట్లో ప్రశాంతంగా వుండాలని వస్తే ఇక్కడా పేషెంట్లే ఎలా చెప్పు... ఆమెను వెళ్లిపొమ్మని చెప్పు..'' హాల్లో వున్న నైనాకు వినిపించేలా బిగ్గరగా అరిచాడు విశ్వాస్.

''ప్లీజ్... అలా గట్టిగా అరవకండి. ఆ అమ్మాయి వింటుంది...'' అంటూ గదిలోంచి బయటికి వచ్చింది నందిని.

అప్పటికే నైనా లేచి నిల్చుని వెళ్లడానికి సిద్ధమయింది. ''నే వెళ్లొస్తానండి...'' అంటూ నందిని సమాధానం కోసం చూడకుండా వెళ్లిపోయింది నైనా.

ఉస్సూరంటూ నిట్టూరుస్తూ హాల్లో సోఫాలో కూర్చుండిపోయింది నందిని.

డైనింగ్ టేబుల్ దగ్గర డిన్నర్ తీసుకుంటున్నారు నందిని, విశ్వాస్‌లు.

''ఏవండీ... మీ కిష్టమని పనీర్ మసాలా చేసాను'' అంటూ కొసరి కొసరి వడ్డిస్తోంది.

విశ్వాస్ నవ్వుతూ ''నువ్విలా కొసరి కొసరి వడ్డిస్తున్నావంటే ఏదో ముందరి కాళ్లకు బంధం వేయడానికే... నాకు తెలుసులే'' అన్నాడు.

పాపం సాయంకాలం మనింటికి వచ్చిందే అమ్మాయి నైనాను తలుచుకుంటే జాలేస్తుందండీ.

''ఎందుకూ? ఆవిడ గారికి మొగుడు మొద్దులూ లేరా?''

''భర్త ఎక్కడో విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. తను ఇక్కడ ఒంటరిగానే వుంటోంది. అందుకే ఆ అమ్మాయిని చూస్తే జాలేస్తోంది.''

విశ్వాస్ భోంచేస్తూ నందిని మాటలు వింటున్నాడు.

''అసలే వట్టిమనిషి కూడా కాదు. మనకె లాగూ ఆ అదృష్టం లేదు. ఆ అమ్మాయికి ట్రీట్

మెంట్ చేస్తే భగవంతుడు చల్లగా చూస్తాడని నా ఆశ...''

''ఇక చెప్పిన సెంటిమెంట్ చాలుగానీ... నీ సంతోషం కోసం ఆ అమ్మాయికి ట్రీట్‌మెంట్ చేస్తాను...'' అనేసరికి నందిని మొహం సంతోషంతో విప్పారింది.

★★★

మరునాడు నందిని స్వయంగా నైనా ఇంటికి వెళ్లి తీసుకొచ్చి తన భర్త చేత చెకప్ చేయించి పంపించింది. నైనా వెళ్లేటప్పుడు ఆమె చేతిలో స్వీట్స్, పళ్లు పెట్టి మరీ పంపించింది నందిని.

నందిని సంతోషంగా విశ్వాస్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

''ఏమిటి? చూడబోతే నువ్వే దగ్గరుండి పురుడు పోసేటట్లు వున్నావే?'' అన్నాడు నవ్వుతూ.

''నాకో చెల్లెలుంటే ఆ మాత్రం చెయ్యనా ఏమిటి?'' అంది ధీమాగా.

★★★

''ఇంటికి వెళ్లాలనిపించడం లేదోయి..'' ఆమె కౌగిట్లో కరిగిపోతూ అన్నాడు విశ్వాస్.

''మరేం చేయాలనిపిస్తోంది..''

''ఇలాగే నీ ఒళ్లో తలపెట్టుకొని బజ్జోవాలనిపిస్తోంది...'' చిన్నపిల్లవాడిలా మారాం చేయసాగాడు డాక్టర్.

''నువ్వింకా చిన్న పిల్లాడిననుకుంటున్నావా? మరో ఆరు మాసాలాగితే తమరు తండ్రి కాబోతున్నారు. ఇంక ఈ చిలిపి పనులు మానుకొని బుద్ధిమంతుడిలా వుండాలి...'' అతని నుదుట మీద ముద్దు పెట్టుకుంటూ అందా యువతి.

అంతే గబుక్కున మీదకు లాక్కుని ఆమె అధరాల మధువు గ్రోలసాగాడు. అతన్ని వారించలేదు సరికదా అతనికి అనుకూలంగా మైనంలా కరిగిపోసాగింది.

ఓపది నిమిషాల వరకూ ఇద్దర మధ్య మాటల అవసరం లేకపోయింది. బెడ్ మీద నుంచి అతను లేస్తుంటే....

''నువ్వు డాక్టరువి మాత్రమే కాదు...''

''మరి...'' అంటూ ఆగాడు విశ్వాస్.

''మంచి యాక్టర్‌వి కూడా... మీ ఆవిడ ముందు నేనెవరినో తెలియనట్లు మా బాగా నటించావులే...'' అంటూ కితాబునిచ్చింది నైనా.


''నైనా నీకో గుడ్‌న్యూస్... నందిని ఓ వారం రోజులు తన తల్లిగారింటికి నైనిటాల్ వెళుతోంది... ఇక నీ మకాం నేరుగా మా ఇంటికి మార్చొచ్చు...''

''ఎవరైనా చూస్తే...''

''ఏముంది? నువ్వో పేషెంటువి.. నేనో డాక్టర్‌ని. వైద్యం కోసం వచ్చావనుకుంటారు. ఫోన్ చేస్తాను. సిద్ధంగా వుండు. బై...'' అంటూ వెళ్లిపోయాడు డాక్టర్ విశ్వాస్.

★★★

నందినికి ఎప్పుడెప్పుడు ఇంటికి చేరుకుందామా?



అని తహతహగా వుంది. పదిరోజులుందామని నైనిటాల్‌కి వెళ్లింది. గాని నాలుగు రోజులు ముందుగానే ముంబాయి తిరుగు ప్రయాణమైంది. నిర్ణీత సమయానికి కన్నా ముందే విశ్వాస్‌ను సర్‌ప్రైజ్ చేయాలన్న చిలిపి ఆలోచన ఆమెను నిలబడనీయడం లేదు.

స్టేషన్ నుంచి నేరుగా టాక్సీలో ఇంటికి బయలుదేరింది. ఇంటి ముందు టాక్సీ దిగి, చీకటి పడడంతో విశ్వాస్ పడుకొని వుంటాడు. అతన్ని లేపుదామని సెల్ ఆన్ చేసింది.

''హలో...'' విశ్వాస్ స్వరం వినిపించగానే..

''విశ్వాస్ నీకో సర్‌ప్రైజ్...''

''నందినీ ఎక్కడున్నావ్? నైనిటాల్లో వున్నావా? ఎలా వుంది వాతావరణం? మంచు కరుస్తోందా? అవునూ ఏమిటీ సర్‌ప్రైజ్ అంటున్నావ్?'' అడిగాడు విశ్వాస్.

''సర్‌ప్రైజ్ కాదు. నీకు షాక్..'' అలా మాట్లాడుతూనే తలుపు నెట్టగానే తలుపు తెరుచుకుంది. నీకు మతిమరుపు ఎక్కువ అవుతోంది. తలుపు గడియపెట్టకుండా పడుకుంటావా?'' అంటూ బెడ్ రూం చేరింది నందిని.

అక్కడి దృశ్యం చూస్తూనే.. షాక్ తగిలినట్లు ఉలిక్కిపడింది. నందిని నెత్తిన పిడుగుపడ్డట్లయింది. బెడ్‌పై విశ్వాస్ కౌగిలిలో నైనా. కౌగిలి విడవకుండానే సెల్‌లో మాట్లాడుతున్నాడు విశ్వాస్.

''విశ్వాసఘాతకుడా? నీ పేరులోనే విశ్వాసముంది. కానీ నీలో లేదు. నీకు షాక్ ఇద్దామనుకున్నా. కానీ నాకు షాక్ ఇచ్చావు...''

ఊహించని ఈ పరిణామానికి విస్తుపోయారు విశ్వాస్, నైనా. నందిని అపరకాళిలా మారింది.

''సొంత చెల్లెలు కన్నా ఆప్యాయంగా చూసానే. తిన్నింటి వాసాలే లెక్కిస్తావా? నీలాంటి రాక్షసి బతికి వుండకూడదు. నిన్ను చంపేయాలి...'' అంటూ నైనా గొంతు ఒడిసి పట్టుకుంది.

అలా వదిలేస్తే నైనా చావు ఖాయం. నందిని చేతుల్లో నుంచి నైనాను ఎలాగైనా కాపాడాలని విశ్వాస్ తన చేతికి దొరికిన ఫ్లవర్‌వాజ్ తీసుకొని తలపై మోదాడు.

ఆ దెబ్బకు కుప్పకూలింది నందిని. అలా నిర్జీవంగా పడిపోయిన నందిని శవాన్ని ఆ రాత్రి ఫ్రిజ్‌లో దాచాడు విశ్వాస్.

★★★

సేఠ్ చమన్‌లాల్ గంగూబాయి చేతిలోని బంగారు గాజులు తీసుకొని పరీక్షించాడు. అవి తన షాపులోనివే. అందుకే వాటి గురించి ఆరా తీశాడు. డబ్బు ఇస్తానని గంగుబాయిని పక్కగదిలో కూర్చోబెట్టి పోలీసులకు ఫోన్ చేశాడు. క్షణాల్లో పోలీసులు రంగప్రవేశం చేసారు. ఎస్ ఐ వినాయక్‌రావు గంగూబాయిని పిలిచి...

''నిజం చెప్పు ఈ గాజులు ఎక్కడ దొంగిలించావు? మర్యాదగా చెప్పావా సరే... లేదా మా లాఠీలకు పని చెప్పాల్సి వుంటుంది.'' అనేసరికి...

గంగూబాయి గజగజా వణికిపోతూ అవి డాక్టర్ విశ్వాస్ భార్య నందిని గాజలు అవి. ఈ ఉదయమే ఆమె శవాన్ని ఫ్రిజ్‌లో చూసానని చెప్పింది.

నిమిషాల్లో పోలీస్ జీపు డాక్టర్ విశ్వాస్ ఇంటి ఆవరణలోకి ప్రవేశించింది.

అప్పటికే కారులో ప్రయాణానికి సిద్ధమయివున్నాడు డాక్టర్ విశ్వాస్.

ఎస్ఐ వినాయక్‌రావు ''డాక్టర్ ఎక్కడికి బయలుదేరారు?'' అని అడిగాడు.

విశ్వాస్ ఏమాత్రం తడబడకుండా...

''నైనిటాల్ వెళుతున్నా. నా భార్య నందినిని తీసుకురావడానికి...''అన్నాడు.

''ఓసారి మీ కారు డిక్కీ తెరుస్తారా?'' ఎస్ఐ అనేసరికి విస్తుపోయాడు. ఇంత త్వరగా తన నేరం బయటపడుతుందనుకోలేదు.

డిక్కీ తెరిచిన పోలీసులకు అందులో నందిని శవం కనిపించింది.

ఎస్ఐ డాక్టర్ విశ్వాస్‌ను, అతనికి సాయం చేసిన నైనాను కూడా అరెస్ట్ చేసారు. తమ ప్రేమ ఇంత త్వరగా ఇలా మలుపు తిరుగుతుందని ఊహించలేదు వాళ్లు. కేసు విచారణలో వుంది.

★



## చిరంజీవి నాకు స్ఫూర్తి

**టా**లీవుడ్‌లో అపజయం అంటూ ఎరుగని హీరోగా గత ఇరవై ఏళ్ళగా నిలదొక్కుకున్న వెంకటేష్‌కి చిరంజీవి అంటే చాలా ఇష్టం. ఆయనకి చిరంజీవి మంచి మిత్రుడు కూడ. 'నేను సినిమా రంగంలోకి ప్రవేశించిన నాటికే చిరంజీవి గారు హీరో. హిట్-ఫ్లాప్‌లతో సంబంధం లేదు. 1987 నుంచి చిరంజీవి గారే నెంబర్ వన్ హీరో. అయినా ఇప్పటికీ ఆయన ఏ సినిమాలో నటించినా అదే తన మొదటి సినిమా అన్నట్టుగా అంకిత భావంతో పని చేస్తారు. నాకది చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. అదలా ఉంచితే 'మెగా స్టార్' అయినా ఆయన ఎప్పుడూ ఆ ఆధిక్యతని ఎవరి మీదా చూపించ లేదు. పేదలన్నా, బలహీనులన్నా విపరీతంగా జాలి చూపించే చిరంజీవి గారంటే నాకు చాలా చాలా ఇష్టం. ఇష్టమే కాదు, చాలా విషయాల్లో నాకాయన స్ఫూర్తి కూడ' అని ఇటీవల ఒకానొక ఇంటర్వ్యూలో విక్టరీ వెంకటేష్ పేర్కొనడం వెంకటేష్ వ్యక్తిత్వం ఎంత గొప్పదో చెప్పక చెప్పింది. హీరోల్లో ఈ ఐక్యత ఒక్క టాలీవుడ్‌కే పరిమితం అనిపించింది.

